క్లుప్తంగా

పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు



జేసీబీతో పైపులైన్ లీకేజీలను సరిచేయిస్తున్న అధికారులు

కొందుర్గు: 'కాలనీల్లో కంపు' అను శీర్షికన ఈ నెల 10వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కొందుర్గులో పైపులైన్ లీకేజీలను సరిచేయించారు. పంచాయతీ కార్యదర్శి బాబయ్య స్పందిస్తూ కొందుర్గు మెయిన్‌రోడ్డులోని యూనియన్ బ్యాంక్ ఎదుట, తహసీల్దార్ కార్యాలయం ఎదుట లీకేజీలకు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సాక్షిని అభినందించారు.

ఎస్‌ఐకి సన్మానం



ఎస్‌ఐని సన్మానిస్తున్న నాయకులు

కేశంపేట: కేశంపేట ఎస్‌ఐగా ఇటీవల విధుల్లో చేరిన లింగంను మంగళవారం ఆదివాసీ నాయకులు కలిసి సన్మానించారు. న్యాయం వైపు ఉంటూ సామాన్యులకు అందుబాటులో ఉండాలని ఎస్‌ఐని కోరారు. ఎస్‌ఐని కలిసి వారిలో రూప్లానాయక్, దాసునాయక్, ధనుసింగ్ నాయక్ తదితరులు ఉన్నారు.

కళాశాలను సందర్శించిన నాయకులు



విద్యార్థులతో మాట్లాడుతున్న నేతలు

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి సందర్శించారు. ఈసందర్భంగా కళాశాలలో నెలకొన్న సమస్యలను వారు పరిశీలించారు. కళాశాలలోని శిథిలావస్థకు చేరిన ప్రయోగశాలలు, తరగతి గదులు, మరుగుదొడ్లను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ తాండ్ర విశాల, శ్రావణ్, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, కాశీనాథ్ రెడ్డి, తిరుపతిరెడ్డి, చెన్నయ్య, బాబర్‌ఖాన్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



క్యారీ బ్యాగులు పంపిణీ చేస్తున్న సాధన, అనురాధ

షాబాద్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కొండ సాధన, అనురాధ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ సంతలో వినియోగదారులకు, మహిళలకు, క్యారీ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గించి ప్రకృతిని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. బట్ట క్యారీ బ్యాగులను వినియోగించు కోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, మోర్చా జిల్లా కార్యదర్శి మాణెయ్య, స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, జిల్లా కార్యదర్శి కుతురు మహేందర్, మహేష్, కృష్ణారెడ్డి, జనార్దన్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, నవీన్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

రామగుండం సీపీని కలిసిన ఒగ్గుకిషోర్



శ్రీనివాసులుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఒగ్గుకిషోర్

షాద్‌నగర్‌రూరల్: రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్(సీపీ) శ్రీనివాసులును మంగళవారం షాద్‌నగర్ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఒగ్గుకిషోర్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా బాధ్యతలను చేపట్టిన సందర్భంగా పూలబొకేను అందజేసి శుభాకాంక్షలను తెలిపారు.

ఈసీవాగుపై బ్రిడ్జి నిర్మాణం ఎన్నడో?

- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- శంకుస్థాపనకే పరిమితమైన నక్కలపల్లి ఈసీవాగు బ్రిడ్జి



నక్కలపల్లి సమీపంలో వంతెన లేక ప్రమాదకరంగా ఈసీవాగు

మొయినాబాద్‌రూరల్: ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని గత ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. కానీ గ్రామీణ ప్రజలకు అవసరమైయ్యే వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. మారుమూల గ్రామాలను కలుపుతూ నిర్మించాలనుకున్న మొయినాబాద్, షాబాద్ మండలాల్లోని గ్రామాలను కలిపే మధ్యలో ఉన్న ఈసీవాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం ఐదు కోట్ల నిధులు విడుదల చేసి సంవత్సరం అవుతున్నా నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వల్ల పనులు కార్యరూపం దాల్చడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఈసీవాగుపై వంతెన లేకపోవడంతో చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు వర్షాకాలం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. షాబాద్ మండలం సర్దార్‌నగర్ అంగడి, షాద్‌నగర్‌కు వెళ్లే ప్రజలు చేవెళ్ల నుంచి తిరిగి పోవాల్సి వస్తుందని అంటున్నారు. నక్కలపల్లి నుంచి హైతాబాద్ గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరం ఉంది. వర్షకాలంలో వాగు వస్తే వాగులోంచి వాహనాలు రాకపోకలు సాగిస్తున్న సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. నక్కలపల్లి ఈసీ వాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తే తోల్‌కట్ట, ఎత్‌మర్‌పల్లి, నక్కలపల్లి, చాకలిగూడ, కేతిరెడ్డిపల్లితో పాటు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు నక్కలపల్లి నుంచి షాబాద్‌కు వెళ్లేందుకు దగ్గర అవుతుంది. బ్రిడ్జి పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రూ. ఐదు కోట్ల నిధులు మంజూరు

ఈసీవాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం సీఆర్ఆర్ అంచనా ఐదు కోట్లు నిధులు మంజూరయ్యాయి. గత సంవత్సరంలో 2023 ఏప్రిల్ 16న అప్పటి రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్థానిక ఎమ్మెల్యేతో కలిసి పనులకు శంకుస్థాపన చేశారు. కానీ పది నెలలు దాటిన పనులు ప్రారంభించలేదు. దీంతో శిలాఫలకానికే బ్రిడ్జి నిర్మాణ పనులు పరిమితమైయ్యాయి.

బ్రిడ్జి నిర్మిస్తే ఉపయోగం



మండలంలోని నక్కలపల్లి సమీపంలో గల ఈసీవాగుపై బ్రిడ్జి చేపట్టి నిర్మిస్తే నక్కలపల్లితో పాటు పలు గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది. షాబాద్ మండలం సర్దార్‌నగర్, షాద్‌నగర్ వెళ్లాలంటే చేవెళ్ల నుంచి తిరిగి వెళ్తున్నారు. దీనిని ఆలోచించి ప్రజాప్రతినిధులు అధికారులు నిధులు మంజూరైన వాటితో బ్రిడ్జి నిర్మాణం కోసం కృషి చేయాలి

–నిరంజన్‌గౌడ్, రైతు, నక్కలపల్లి

కాంట్రాక్టర్ రావడం లేదు



వాగుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం కృషి చేసింది. కానీ, గత సంవత్సరం ఏప్రిల్‌లో పనులకు శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పనులు చేస్తా మని ముందుకు వచ్చారు. కానీ ఎన్ని ఫోన్లు చేసిన స్పందించడం లేదు. మెసేజ్ పెట్టాం, నోటీసులు పంపించాం అయినా స్పందన లేదు.

–విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి వారికి పాఠాలు బోధించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం బాలీశ్వర్ మాట్లాడుతూ... సమాజంలో ఉపాధ్యాయులకు ఎప్పటికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. తమ బోధనల ద్వారా ఉపాధ్యాయులు దేశానికి ఉపయోగపడే శాస్త్రవేత్తలు, న్యాయవాదులు, రాజకీయ నాయకులను తయారు చేస్తారని తెలిపారు. చిన్నప్పటి నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని దాని సాధనకు అహర్నిశలు కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో చదువుకున్న వారికే అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఉంటుందనే విషయాన్ని విద్యార్థులు గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు చేవెళ్లలో సీపీఐ బహిరంగ సభ

హాజరుకానున్న పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ, ఎమ్మెల్యే సాంబశివరావు

చేవెళ్ల: నేడు చేవెళ్లలో సీపీఐ పార్టీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి పేర్కొన్నారు. చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో బుధవారం ఉ.11 గంటలకు సభ ఉంటుందని చెప్పారు. పేద ప్రజలకు పక్కా ఇళ్లు ఇవ్వాలని గుడిసెలు వేసుకున్న ప్రజలకు పట్టా సర్టిఫికెట్లు ఇవాలనే డిమాండ్లతో సభ జరుగుతుందన్నారు. ఈ సభకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి, సీపీఐ ఎమ్మెల్యే సాంబశివరావులు ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారని చెప్పారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

రేపు నాగులమ్మ నూతన విగ్రహ ప్రతిష్ఠాపన

మొయినాబాద్‌రూరల్: మండలంలోని ఎన్కెపల్లిలో రేపు (గురువారం) ఉ.5 గంటలకు నాగులమ్మ నూతన విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహిస్తున్నామని ఎన్కెపల్లి గ్రామానికి చెందిన నాగులమ్మ గుడి ప్రతిష్ఠాపన దాత సత్యనారాయణగౌడ్ తెలిపారు. గురువారం ఉ. 5 గంటలకు విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు హోమాలు నిర్వహించబడుతాయన్నారు. అనంతరం స్వామివారి దర్శనంతో పాటు విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రాజెక్టుల అప్పగింతపై కాంగ్రెస్‌ది ద్వంద్వ వైఖరి

జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి



నల్లగొండ సభకు వెళ్తున్న అవినాశ్‌రెడ్డి, నాయకులు

షాబాద్: ప్రాజెక్టులను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు అప్పగించేది లేదంటూ షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ నుంచి చలో నల్లగొండ సభకు బీఆర్ఎస్ నాయకులు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు కాపాడితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా 60 రోజుల్లోనే కేంద్ర ప్రభుత్వానికి అప్పజెప్పిందని విమర్శించారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తే భవిష్యత్‌లో ఐదు జిల్లాలు ఎడారికి మారే ప్రమాదం ఉందన్నారు. కృష్ణాజలాల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటంతోనే అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం తీర్మానం చేసిదన్నారు. కృష్ణా జలాలపై పోరాడాల్సిన కాంగ్రెస్ నాయకులు తమపై ఎదురుదాడి చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం, మంత్రులు నాగార్జునసాగర్ ప్రాజెక్టును ఎందుకు సందర్శించడం లేదని ప్రశ్నించారు. ప్రజలు నీటి కోసం మరోసారి పోరాటం చేయాల్సి అవసరం వచ్చిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో లబ్ధి

దోస్వాడ రాజు

షాబాద్: గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని దోస్వాడ రాజు సూచించారు. మంగళవారం మండలంలోని తాళ్లపల్లిలో శంకర్‌పల్లి విజయ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన 400 మందికి పైగా వైద్య పరీక్షలు చేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, తాళ్ల సుభాష్‌గౌడ్ పాల్గొని వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పేద ప్రజలకు వైద్య పరీక్షలు అందించేందుకు కార్పొరేట్ ఆస్పత్రులు ముందుకు రావాలని కోరారు. డాక్టర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, తాళ్ల సుభాష్‌గౌడ్‌లు మాట్లాడుతూ...పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రమేష్ పంతులు, మాజీ ఉపసర్పంచ్ బాసనర్సింహులు, డీలర్ ప్రతాప్‌రెడ్డి, బాల్‌రాజు, వెంకటయ్య, మల్లేష్, దయాకర్‌చారి, తదితరులు ఉన్నారు.

ఆలయ వ్యవస్థను బలోపేతం చేయాలి

చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్



రమాదేవికి జ్ఞాపికను అందజేస్తున్న అర్చకులు

మొయినాబాద్: భద్రాచలంలో జరిగిన భక్త రామదాసు 391వ జయంతి వేడుకలకు చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్ హాజరయ్యారు. భక్త రామ దాసు జయంతి వేడుకల సందర్భంగా గిరిజన భక్తులను సీతారామచంద్రస్వామి ఆలయంలోకి ఆలయ ఈఓ రమాదేవి ఆప్యాయంగా స్వాగతించడం ఆనందాన్ని ఇచ్చిందని రంగరాజన్ తెలిపారు. ధర్మరక్షణలో భాగంగా ఆలయ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు అవసరమన్నారు. ఈ సందర్భంగా ఈఓ రమాదేవిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

రైతుల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ రైతుల నడ్డి విరుస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీను నాయక్ మండిపడ్డారు. మంగళవారం మండలంలోని బూర్గుల, కాశిరెడ్డిగూడ గ్రామాల్లో గ్రామీణ సమ్మె కార్యక్రమానికి సంబంధించి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీను నాయక్ మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటుందని ఆరోపించారు. దీంతో పేద రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. వలసల నివారణకు చేపట్టిన ఉపాధిహామీ పథకంలో కేంద్రం ప్రభుత్వం అనేక మార్పులు చేసిందని దుయ్యబట్టారు. దీంతో గ్రామాల్లో కూలీలు పనికి రావడం లేదన్నారు. ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్రం కుట్రలు పన్నుతుందని చెప్పారు. కార్మికులు ఎన్నో ఏళ్లు పోరాటం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రం తుంగలో తొక్కుతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా 16న దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, జంగయ్య, కృష్ణ, సునీత, యాదమ్మ, ఆలివేలు, శంకరమ్మ, మాధవి, సిద్దమ్మ, చిన్నమ్మ, మాణెమ్మ, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే ఉన్నత భవిష్యత్

శంకర్‌పల్లి జెడ్పీటీసీ గోవిందమ్మ



స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న జెడ్పీటీసీ

శంకర్‌పల్లి: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జెడ్పీటీసీ గోవిందమ్మ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మహాలింగపురం జిల్లా పరిషత్ పాఠశాలలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు, న్యాయవాది కోమటిరెడ్డి లక్ష్మీనర్సింహారెడ్డి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్, పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. 10వ తరగతి ఫలితాల్లో మొదటి స్థానం సాధించిన విద్యార్థికి సొంత డబ్బులతో ఇంటర్ విద్యను చదివించడం జరుగుతుందని చెప్పారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడితే గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు వస్తుందన్నారు. విద్యార్థులు సోషల్ మీడియా, ఫోన్లకు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరహరి, ఎంపీటీసీ యాదగిరి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, అంజయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ మందుతో విటమిన్ ఏ లోపం నివారణ

ఆర్డీఓ సాయిరాం



చుక్కల మందు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

చేవెళ్ల: కంటిచూపు దెబ్బతినకుండా ప్రభుత్వం అందిస్తున్న విటమిన్ ఏ న్యూట్రిషన్ సప్లమెంటరీ (ద్రవణం)మందును పిల్లలకు తల్లిదండ్రులు తప్పనిసరిగా వేయించాలని ఆర్డీఓ సాయిరాం సూచించారు. విటమిన్ ఏ చుక్కల మందు వేసే కార్యక్రమాన్ని మంగళవారం ఆర్డీఓ సాయిరాం, చేవెళ్ల డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విటమిన్ ఏ చుక్కల మందు వేయుటం వల్ల కంటి చూపు మెరుగుపడుతుందన్నారు. పిల్లలు ఎక్కువగా ఎదుర్కొంటున్న కంటి చూపు సమస్య నివారణకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ మాట్లాడుతూ.. పిల్లలకు చుక్కల మందు వేయడం వల్ల రోగ నిరోధక శక్తి మెరుగుపడుతుందన్నారు. విటమిన్ ఏ లోపం కారణంగా రేచీకటి సమస్య వచ్చే ప్రమాదం ఉందన్నారు. విటమిన్ ఏ లోపం తీవ్రంగా ఉంటే రేటీనా, కార్నియా దెబ్బతింటుందన్నారు. చిన్నారుల్లో విటమిన్ లోపాలు ఉంటే ఎదుగుదల సరిగా ఉండదని చెప్పారు. 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ఈ విటమిన్ ఏ చుక్కల మందు పంపిణీ జరుగుతుందని చెప్పారు. చేవెళ్ల డివిజన్‌లోని ఆలూరు, శంకర్‌పల్లి, టంగటూరు, మొయినాబాద్, చందన్‌వెల్లి, షాబాద్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ చుక్కల మందు వేసే కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. చేవెళ్ల డివిజన్‌లో 9నెలల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారుల సంఖ్య 18,319 మంది ఉన్నట్లు గుర్తించటం జరిగిందన్నారు. మొదటి రోజు 3,038 మంది చిన్నారులకు మందు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రఘుబాబు, డాక్టర్ వేదశ్రీ, గోపాల్‌రెడ్డి, సంతోష, మంజుల, సుదర్శన్, బలరాం, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రవీణ, ఉమారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్త



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మొయినాబాద్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మొయినాబాద్ ఏఎస్సై శివారెడ్డి అన్నారు. మండలంలోని గురుకుల కళాశాల విద్యార్థులకు మంగళవారం పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో ఆటలు ఆడే సమయంలో వచ్చే లింకులు, వాట్సాప్‌లో వచ్చే లింకులు ఓపెన్ చేయొద్దని సూచించారు. ఓటీపీ నంబర్లను ఇతరులకు షేర్ చేయవద్దని చెప్పారు. సైబర్ నేరగాళ్లు బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని అకౌంట్ నంబర్, ఏటీఎం పిన్, ఓటీపీ అడిగితే చెప్పవద్దన్నారు. బ్యాంక్ అకౌంట్, పిన్ నంబర్లు, ఓటీపీలో ఆన్‌లైన్‌లో షేర్ చేయవద్దన్నారు. విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇతరులకు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు శ్రావణయాదవ్, శ్రీనివాస్, మహేశ్వర్‌రెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మున్సిపల్ నూతన కమిషనర్‌గా జి. శ్రీనివాస్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈయన వనపర్తి జిల్లా, కొత్తకోట మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహించారు. కాగా ఇక్కడ పని చేస్తున్న కమిషనర్ జ్ఞానేశ్వర్‌ను పీడీ మెప్మా కార్యాలయానికి బదిలీ చేశారు.

సమస్యలపై ఐక్యంగా పోరాడాలి

జిల్లా రజక సంఘం అధ్యక్షుడు అంజయ్



లక్ష్మయ్యను సన్మానించిన రజక సంఘం నాయకులు

చేవెళ్ల: సమస్యల పరిష్కారానికి రజకులంతా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్, నియోజకవర్గం అధ్యక్షుడు మల్లేశ్‌లు అన్నారు. మండల కేంద్రంలోని అర్ అండ్‌బీ అతిథి గృహం వద్ద మంగళవారం మండల రజక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చేవెళ్ల మండల రజక సంఘం అడహక్ కమిటీని ఎంపిక చేశారు. అడహక్ కమిటీ చైర్మన్‌గా చేవెళ్లకు చెందిన లక్ష్మయ్య, కమిటీ సభ్యులుగా గుండాల శ్రీనివాస్, ఊరేళ్ల యాదయ్య, ఎన్కెపల్లి యాదయ్య, రావులపల్లి కుమార్, దీపక్, పాండు, రామన్నగూడ ప్రభాకర్, న్యాలట శ్రీశైలం, తదితరులను ఎంపిక చేశారు. వారు మాట్లాడుతూ.. రజక సంఘం సభ్యులంతా ఏకతాటిపైకి వచ్చి సభ్యులంతా ఒక కమిటీగా ఏర్పడాలని చెప్పారు. మండలంలోని ప్రతి గ్రామంలో గ్రామ కమిటీలను మండల అడహక్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయటం జరుగుతుందని చెప్పారు. ఆరు నెలల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో పూర్తి స్థాయి కమిటీలను ఏర్పాటు చేసిన తరువాత మండల నూతన కమిటీని ఎన్నుకోవటం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు వై. శ్రీనివాస్, అశోక్, శ్రీనివాస్, జంగయ్య, మల్లేశ్, రాజేశ్, మదు, రాకేశ్, శ్రీనివాస్, శివకుమార్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బాధ్యత ఉపాధ్యాయులదే



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు

కేఎల్ డీమ్డ్ టూబీ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మణ్ అవిష్

మొయినాబాద్‌రూరల్: ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్యను అందించాలని కేఎల్ డీమ్డ్ టూబీ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ కోనేరు లక్ష్మణ్ అవిష్ అన్నారు. మంగళవారం మండలంలోని అజీజ్‌నగర్ సమీపంలో గల కేఎల్ డీమ్డ్ టూబీ యూనివర్సిటీ కళాశాల సమీపంలోని కేఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో ఒక రోజు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల అధ్యాపకులు, కళాశాలల అధ్యాపకులు హాజరయ్యారు. ముఖ్యఅతిధిగా విచ్చేసిన లక్ష్మణ్ అవిష్ ఆయన మాట్లాడుతూ.. అంకిత భావంతో కూడిన అధ్యాపకుల కృషి విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలు ప్రేరణను మెరుగుపరచడం విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని సూచించారు. విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు సాంకేతికలతో సన్నద్ధం చేయడానికి కృషి చేయాలన్నారు. కేఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ పాఠశాల నుంచి విశిష్ట వక్తలు నైపుణ్యాన్ని ఎలా పెంపొందించుకోవాలని అనే అంశంపై వివరించారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంల ద్వారా ఉపాధ్యాయులలో కొత్త నైపుణ్యం పెంపొందించుకుని ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని సాధించడానికి శక్తివంతం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులకు కేస్ స్టడీ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ వర్క్‌షాప్‌లో చేవెళ్ల గురుకుల కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి, ఆయా పాఠశాలల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.